
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 9 నవంబరు 2024
5

జపాన్ లీడర్‌షిప్ శిక్షణకు స్వప్న
- రామవరం ఎంసీహెచ్‌లో విధులు నిర్వహిస్తూ ఎంపిక
- 12నుంచి 12 రోజులపాటు ట్రైనింగ్

7



18 ఏళ్లు నిండాయా...

- ఓటరుగా నమోదు చేయించుకునే అవకాశం
- నేడు, రేపు ప్రత్యేక కార్యక్రమం

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నూతన ఓటరు జాబితాను కొత్త సంవత్సరంలో అధికారులు విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఓటరు జాబితాలో పేరు రావాలంటే ఇప్పటికీ ఓటరుగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తుంది ఎన్నికల సంఘం. 2025 జనవరి నాటికి 18ఏళ్లు నిండే వారు కూడా ముందస్తుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటు లేని వారు దరఖాస్తు చేసుకుంటే తక్షణమే ఓటు హక్కును కల్పించనున్నారు. పేరు ఇతర తప్పులు సవరించుకునేందుకు కూడా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేకుంటే సమీపంలోని బీఎల్వోకు దరఖాస్తును నేరుగా కూడా అందించవచ్చు.

వచ్చే ఏడాది జనవరి 6న కొత్త ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు. దీని కోసం అధికారుల (మిగతా 6వ పేజీలో)

బిర్యానీ తిన్న వ్యక్తికి అస్వస్థత



ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రూ.150కే కేజీ బిర్యానీ వస్తుందని పార్సిల్ తీసుకెళ్లి ఆరగించిన వ్యక్తి.. కొద్ది గంటల తర్వాత అస్వస్థతకు గురయ్యాడు. ముఖం వాపు రాగా.. శరీరంపై ఎలర్జీ దద్దులు రావటంతో ఆ వ్యక్తి కుటుంబ సభ్యులు రెస్టారెంట్ వద్దకు వచ్చి యాజమాన్యాన్ని నిలదీశారు. జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. ఖమ్మం బైపాస్ ఎరోడ్డులోని నాయుడు రెస్టారెంట్‌లో సమీప ప్రాంతానికి చెందిన వ్యక్తి వచ్చి శుక్రవారం మధ్యాహ్నం బిర్యానీ పార్సిల్ తీసుకెళ్లాడు. ఇంటికి వెళ్లి తిన్న తర్వాత ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు నాయుడు రెస్టారెంట్ వద్దకు వచ్చి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్ రెస్టారెంట్‌లో తనిఖీలు చేపట్టారు. వంటశాల అపరిశ్రభంగా ఉండటంతోపాటుగా ఆహారపదార్థాల నిర్వహణ సరిగా లేదని గుర్తించారు. డీప్ ఫ్రిజ్‌లో బిర్యాని ఉంచటాన్ని గుర్తించారు. దుర్వాసన వచ్చిన చికెన్‌తోపాటుగా బిర్యాని శ్యాంపిల్స్ సేకరించారు.



కేక్ కట్ చేసిన పొంగులేటి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేశారు. నేలకొండపల్లిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఈ వేడుకకు వేదికగా నిలిచింది.

-ఆంధ్రజ్యోతి, నేలకొండపల్లి



శుభాకాంక్షలు తెలిపిన తుమ్మల

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్వయంగా కలుసుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన జన్మదినం సందర్భంగా యాదగిరి గుట్ట క్షేత్రానికి వచ్చిన సీఎంకు తుమ్మల పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం



నిరుద్యోగులతో చెలగాటం

హిందీ పండిట్ల నియామకాల్లో విద్యాశాఖ నిర్లక్ష్యం నిరుద్యోగ ఉపాధ్యాయులకు శాపంగా మారింది. ఉద్యోగాలు వచ్చాయని సంబరాలు చేసుకున్న ఉపాధ్యాయులపై సర్టిఫికెట్లు చెల్లవనే కారణంతో అనర్హత వేటువేయడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అర్హత ఉండి ఉద్యోగ అవకాశం కోల్పోయిన అభ్యర్థులు ఫిర్యాదు చేయడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో వారు అనర్హతకు గురికావడం, ఆ ఖాళీలను భర్తీ చేయడంతో అనుకున్న ఉద్యోగం పొందడంతో వారిలో ఆనందోత్సాహం కనిపిస్తోంది.

- ఏడుగురు హిందీ పండిట్ల తొలగింపుతో కలకలం
- విద్యాశాఖలో బాధ్యతారాహిత్యం
- హిందీ పండిట్ల వ్యవహారంలో ఇద్దరు హెచ్‌ఎంల సస్పెన్షన్
- సర్టిఫికెట్ల పరిశీలనలో నిర్లక్ష్యం వల్ల రోడ్డున పడిన కుటుంబాలు
- కలెక్టర్ పరిశీలనలో మరికొన్ని ఫిర్యాదులు
- ప్రమోషన్లలోనూ అక్రమాలు జరుగుతున్నట్టు ఆరోపణలు

ఖమ్మం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఉపాధ్యాయ నియామక భర్తీ వ్యవహారంలో సర్టిఫికెట్ల పరిశీలనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు హెచ్‌ఎంలపై వేటుపడింది. హిందీ పండిట్ల నియామకం సందర్భంగా అర్హతలేని సర్టిఫికెట్లకు అర్హత ఉన్నట్లుగా ధ్రువీకరించడంతో ఏడుగురు నిరుద్యోగులు హిందీ పండిట్‌పోస్టులు పొందిన విషయం విదితమే. దీనిపై అర్హత ఉండి ఉద్యోగాలు రాని వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సర్టిఫికెట్లను పరిశీలించగా అర్హత లేకపోయినా అర్హత ఉన్నట్టుగా ధ్రువీకరించినట్టు వెల్లడైంది. ఈ నేపథ్యంలో అనర్హులకు ఉద్యోగాలు కల్పించేందుకు నివేదిక ఇచ్చిన ఇద్దరు హెచ్‌ఎంలు కొణిజర్ల మండలం గుబ్బగుర్తి హెచ్‌ఎం పి.శివనారాయణ, ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ రంగారెడ్డిని సస్పెండ్ చేస్తూ వరంగల్ ఆర్‌జేడీ కె.సత్యనారాయణరెడ్డి ఆదేశాలు జారీచేశారు. ఇప్పటికే హిందీ పండిట్ల నియామకాలకు సంబంధించి పోస్టింగ్‌లు పొంది 22రోజుల పాటు విధుల్లో ఉన్న ఏడుగురు ఉపాధ్యాయులను ఉద్యోగాల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. వారిస్థానంలో అర్హత ఉన్న మరో ఏడుగురికి ఉద్యోగాలు కల్పిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు జారీచేయడంతో వారంతా విధుల్లో చేరారు. ఉద్యోగాలు కోల్పోయిన వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

సర్టిఫికెట్ల పరిశీలనలో నిర్లక్ష్యం

జిల్లాలో హిందీ పండింట్ పోస్టుల నియామకంలో విద్యాశాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. పర్యవేక్షణ కొరవడింది. చివరకు హిందీ పండిట్ల పోస్టుల నియామకం వివాదంగా మారింది. జీవోనెం. 25ప్రకారం హిందీ పండింట్ పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం హెచ్‌పీటీ ట్రైనింగ్ సర్టిఫికెట్‌తోపాటు డిగ్రీలో ఒక సబ్జెక్టు హిందీ తప్పనిసరిగా ఉండాలని నిబంధన ఉంది. డిగ్రీలో హిందీ లేని పక్షంలో ఎంఏ హిందీ పూర్తిచేసి హెచ్‌పీటీ ఉన్న వారికి కూడా హిందీ పండిట్ పోస్టులు పొందే అర్హత ఉంది. జిల్లాలో దరఖాస్తు చేసుకుని ఉద్యోగాలు పొందిన వారిలో దక్షిణ భారతహిందీ ప్రచారసభ, మద్రాస్ నుంచి పలు రాష్ట్రాలకు హిందీ సర్టిఫికెట్ కోర్సులను చదివినట్లుగా సర్టిఫికెట్లను పొందుపరిచారు. గతంలో ఈ సర్టిఫికెట్ల ద్వారా అనేకమంది ఉద్యోగాలు పొందారు. గతంలో డీఎస్సీ నియామకాల్లో ఆ సర్టిఫికెట్లకు అర్హత ఉండేది. ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.25 ప్రకారం హిందీ కోర్సులకు సంబంధించిన పలు సర్టిఫికెట్లను పక్కన పెట్టారు. కేవలం హెచ్‌పీటీతోపాటు డిగ్రీలో హిందీ తప్పనిసరిగా ఉండాలని నిబంధన విధించారు. డిగ్రీలో హిందీలేని పక్షంలో ఎంఏ హిందీ ఉండాలని కూడా నిబంధన పెట్టారు. ఈ క్రమంలో కొందరు దక్షిణభారత హిందీ ప్రచారసభకు ఇతర రాష్ట్రాలకు సంబంధించిన అర్హత లేని సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారు. సర్టిఫికెట్ల పరిశీలన తరుణంలో సంబంధిత ఇద్దరు హెచ్‌ఎంలు జీవోను పరిశీలించకపోవడం, అర్హత ఉన్నట్టుగా ధ్రువీకరించి వారికి హిందీ పండిట్ ఉద్యోగాలు ఇచ్చారు. అర్హత ఉండి ఉద్యోగాలు కోల్పోయిన వారు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. పునర్విచారణలో ఏడుగురు హిందీ పండిట్ ఉపాధ్యాయులపై అనర్హత వేటు వేసి అర్హత ఉన్న వారికి ఉద్యోగాలు కల్పించారు. దీంతో హెచ్‌ఎంల ఉపాధ్యాయ సంఘాలు హెచ్‌ఎంలను సస్పెండ్ చేయడం అన్యాయమని, సహాయకులుగా వెళ్లినవారిని ఎలా బాధ్యులను చేస్తారని డీఈవో సోమశేఖరశర్మకు ఫిర్యాదు చేశారు

ప్రమోషన్ల విషయంలో...

జిల్లాలో విద్యాశాఖ కాకుండా వైద్య ఆరోగ్యం, రెవెన్యూ, పలు ఇంజనీరింగ్ శాఖలు పంచాయతీరాజ్‌తోపాటు పలు ప్రభుత్వ శాఖలు కార్పొరేషన్లలో ఉద్యోగులు ప్రమోషన్లకు ఇతర రాష్ట్రాల డిగ్రీలు వాడుతున్నారు. అక్కడికి వెళ్లి చదవకపోయినా మొక్కుబడిగా పరీక్షలు రాయడం అడిగినంత సొమ్ములు ఇచ్చి డిగ్రీతో పాటు ఇతర ఉన్నత, సాంకేతిక సర్టిఫికెట్లు పొంది కొందరు నేరుగా ఉద్యోగాలు పొందుతుండగా మరికొందరు శాఖపరమైన ప్రమోషన్లలో ఈ సర్టిఫికెట్లు వినియోగిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప సర్టిఫికెట్లుకు గుర్తింపు ఉందా లేదా అన్నది కొన్నిశాఖలో పరిశీలించడం లేదు. యూనివర్సిటీలు గుర్తింపు కోల్పోయినా దొడ్డిదారిలో సర్టిఫికెట్లు పొందడం, ప్రమోషన్లకు సర్టిఫికెట్లు పొందుపరిచి లబ్ధిపొందుతున్నారు.

మరికొన్ని ఫిర్యాదులు...

జిల్లాలో డీఎస్సీ నియామకం విషయంలో మరికొందరు అభ్యర్థుల విషయంలో జిల్లా విద్యాశాఖకు ఫిర్యాదుల రావడంతో ఎంపికైన ఉపాధ్యాయుల అభ్యర్థులను హోల్డ్‌లో ఉంచారు. దీనిపై కూడా విచారణ జరుగుతోంది. క్రిస్టియన్ మైనారిటీ కోటా విషయంలో ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైనప్పటికి, అభ్యర్థి మైనారిటీ సర్టిఫికెట్ రెండు రాష్ట్రాలనుంచి ఉండడంతో దానిపై కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై కూడా విద్యాశాఖ విచారించి కలెక్టర్‌కు నివేదిక అందించింది. అలాగే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోటాలో ఒక మహిళ అభ్యర్థి తన భర్త ప్రభుత్వ టీచర్‌గా ఉన్నప్పటికీ ఈడబ్ల్యూఎస్‌కు దరఖాస్తు చేసింది. తామిద్దరం వేర్వేరుగా ఉంటున్నామని, భర్త వద్ద ఉండడంలేదని పుట్టింటివద్ద ఉంటున్నానని సదరు అభ్యర్థి పేర్కొంది. భర్తకు తనకు సంబంధం లేదంటూ రాతపూర్వకంగా ఇచ్చినప్పటికీ, విడాకులు చట్టపరంగా తీసుకోకపోవడంతో ఆమె పోస్టును కూడా హోల్డ్‌లో పెట్టారు. ఇలా ఉపాధ్యాయ నియామక వ్యవహారాల్లో ఒక్కొక్కటిగా విద్యాశాఖకు ఫిర్యాదులందుతున్నాయి.

మధిరను సుందరంగా తీర్చిదిద్దాలి..

- 14న 'నేను-నా మధిర' కార్యక్రమం ప్రారంభం
- క్లీన్ అండ్ గ్రీన్ పట్టణమే లక్ష్యంగా పనిచేయాలి
- ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలి
- మునిసిపాలిటీకి మరో స్వీపింగ్ మిషన్
- చెత్త కనిపిస్తే కమిషనర్‌ను సస్పెండ్ చేస్తా
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



మునిసిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న భట్టి

మధిర టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పుట్టిన రోజైన నవంబరు 14న మధిర మునిసిపాలిటీలో క్లీన్ అండ్ గ్రీన్ మధిరే లక్ష్యంగా 'నేను నా మధిర' అనే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం మధిరలోని క్యాంపు కార్యాలయంలో మధిర మునిసిపాలిటీపై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. మధిర పట్టణంలోకి ప్రవేశించే అన్ని మార్గాలను సుందరంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని చెత్తా చెదారం, మురికిలేని సుందరమైన మధిర నిర్మాణం కోసం అందరు కలిసి కట్టుగా కృషి చేయాలని భట్టి పిలుపునిచ్చారు.

నవంబరు 14లోపు ప్రతి ఇంటికి తడి, పొడి చెత్త బుట్టల పంపిణీని పూర్తి చేయాలని, ఇంటి ముందు కానీ, దుకాణాల ముందు ఇకపై చెత్త పడవేయవద్దని ప్రతి రోజు చెత్త సేకరణ వాహనాలు మీ ముందుకు వస్తాయని వారికి మీ దగ్గర ఉన్న చెత్తను అందించాలని కోరారు. ఈ లోపు మధిరలో ఉన్న డంపింగ్ యార్డును తొలగించి మడుపల్లిలోని నూతన డంపింగ్ యార్డు పనులు పూర్తి చేసి చెత్తను అక్కడికి తరలించాలని, వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసి వాటిని కలెక్టర్ ట్రాకింగ్ చేసేలా చూడాలని కోరారు. ఇంటి ముందు డ్రెయినేజీ దాటి ర్యాంపులు నిర్మించిన వారందరికీ నోటీసులు ఇచ్చి వారం రోజుల్లో తొలగించేలా చూడాలని, లేకపోతే వారం తరువాత జేసీబీలతో తొలగించాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కమిషనర్‌ను సస్పెండ్ చేయటానికైనా వెనకాడనని హెచ్చరించారు. మరో స్వీపింగ్ మిషన్ కొనుగోలు చేయాలని కలెక్టర్‌కు సూచించారు.

మునిసిపల్ కార్యాలయం పాత డిజైన్‌రద్దు చేసి అధునాతన సదుపాయాలతో వందేళ్లు ఉండేలా నూతన డిజైన్‌ను రూపొందించాలని ఆదేశించారు. వైరా నది ప్రవాహం మధిర పట్టణంపై పడకుండా నిర్మాణం చేయనున్న రిటైనింగ్ వాల్ నమూనాను పరిశీలించి వర్షపు నీరు డ్రెయిన్లకు (మిగతా 6వ పేజీలో)

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

- రైతులను ఇబ్బందిపెడితే సహించం
- సన్న రకానికి రూ.500 బోనస్ ఇస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నేలకొండపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించబోమని పాలేరు శాసనసభ్యుడు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. నేలకొండపల్లిలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నదన్నారు. రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఎన్నికల్లో హామీఇచ్చిన విధంగా సన్నరకానికి రూ.500 బోనస్‌గా చెల్లిస్తున్నామన్నారు.

ఈ సీజన్‌లో ధాన్యం దిగుబడులు బాగా వచ్చాయని, ప్రతిగింజ కొనుగోలు చేసేవిధంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేయటానికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులను ఇబ్బందులు పెట్టొద్దని అధికారులను ఆదేశించామన్నారు. తొలుత 41మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. రేవంత్ బర్త్‌డే సందర్భంగా దివ్యాంగులకు మంత్రి ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెల్లూరి భద్రయ్య, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, ఆరెకట్ల గురవయ్య, అనంతు కాశయ్య, గుడిమళ్ల మధు, బొల్లినేని వెంకటేశ్వర్లు, గోళ్ల శ్రీనివాసరావు, యడవల్లి సైదులు, రాయపూడి నవీన్, చిట్టూరి అచ్చయ్య కుక్కల హనుమంతరావు, ఏలూరి మురళి, మైసా శంకర్, ఎనికె జానకిరామయ్య, తహసీల్దార్ జాదవ్ మాణిక్యం, ఎంపీడీవో యర్రయ్య, ఎంఈవో చలపతిరావు నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో

ఏటీఎం ట్యాంపరింగ్ ముఠా

ఖమ్మం క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓప్రైవేటు బ్యాంకు చెందిన ఏటీఎంను ట్యాంపరింగ్ చేస్తూ నగదును తమ ఖాతాల్లోకి బదిలీ చేయించుకుంటున్న అంతర్రాష్ట్ర ముఠాను శుక్రవారం టుటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఎన్ఎస్‌టీరోడ్డులోని ఓఏటీఎం నుండి ఇతర ఖాతాల్లోకి నగదు బదలీ అవుతున్నట్టు సంబంధిత బ్యాంకు హెడ్ ఆఫీస్‌కు సమాచారం రావడంతో ఖమ్మంలోని సంబంధిత ఏటీఎం బ్రాంచ్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు.

దీంతో పోలీసులు నిఘాపెట్టగా బిహార్ ప్రాంతాని4కి చెందిన ఓ మహిళ ఏటీఎం వద్దకు వచ్చి ట్యాంపరింగ్ చేయడానికి ప్రయత్నిచడంతో సదరు మహిళను పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు తెలిసింది. సదరు మహిళతో ఉన్న ముగ్గురు వ్యక్తులు పారిపోయినట్టు సమాచారం. వీరి కోసం టుటౌన్ పోలీసులు గాలిస్తున్నట్టు సమాచారం.



మార్మోగుతున్న శరణుఘోష

- ఎటుచూసినా అయ్యప్ప మాలధారుల సందడే..
- ఆలయాలు, పీఠాల్లో సామూహిక పూజలు
- పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ కేంద్రాలు
- గుబాళిస్తున్న ఆధ్యాత్మిక సౌరభం

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభంకావటంతో ఖమ్మం నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా అయ్యప్పల శరణుఘోష మార్మోగుతోంది. అయ్యప్ప స్వామి ఆలయాలతోపాటు ఇతరత్రా భక్తులు నెలకొల్పుకున్న పీఠాల్లో భక్తిపారవశ్యం వెల్లివిరుస్తోంది. నల్లని దుస్తులు ధరించిన దీక్షాపరులు, గురుస్వాముల భజనలు, సంకీర్తనలు, హోమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మొదటిసారి దీక్ష ధరించిన కన్నెస్వామి మొదలు స్వాముల వరకు హరిహర సుతుని సేవిస్తూ వేలాదిమంది దీక్షలు ధరించటంతో నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా ఎటుచూసినా దీక్షా పరులే దర్శనమిస్తున్నారు. అయ్యప్పభక్తులు కఠిన ఆచారాలతోపాటు ఆహార నియమాలను పాటిస్తారు. కనుక వారి కోసం అన్నదాన సదుపాయాలు, తదితర పీఠాలు వెలుస్తున్నాయి.

అయ్యప్ప దీక్షాపరులకు ఖమ్మం జిల్లా మొదటి నుంచి నిలయంగా ఉంది. అయ్యప్ప స్వామి పట్ల భక్తి విశ్వాసాలు అధికం కావటంతోపాటు స్థానికంగా దీక్షా పరులకు అన్ని విధాలా చేయూత లభిస్తుండటంతో ఏటికేడు దీక్షాపరుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది కొద్ది రోజులుగా దీక్షలు తీసుకునే కార్యక్రమాలు మొదలవటం వల్ల జిల్లావ్యాప్తంగా దాదాపు పదివేల మంది దీక్షా పరులు ఉన్నట్లు తెలుస్తోంది. దీక్షపట్ల ఆసక్తి కనబరుస్తున్న వారిని బట్టి ఖమ్మం నగరంలోనే ఈ ఏడాది దాదాపు పదమూడు వేల మంది వరకు దీక్షను తీసుకునే అవకాశం ఉండగా (మిగతా 6వ పేజీలో)



ఉత్తరద్వారంలో దర్శనమిస్తున్న శ్రీ సీతారామచంద్రస్వామి వారు (ఫైల్)

డిసెంబరు 31 నుంచి జనవరి 20 వరకు

వైకుంఠ ప్రయుక్త అధ్యయనోత్సవాలు

- జనవరి 9న తెప్పోత్సవం, 10న ఉత్తర ద్వార దర్శనం
- జనవరి 21 నుంచి 23 వరకు విలాసోత్సవాలు, 26న విశ్వరూప సేవ

భద్రాచలం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ ఏడాది డిసెంబరు 31నుంచి 2025 జనవరి 20వరకు శ్రీవైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నా రు. జనవరి ఒకటి నుంచి 8 వరకు వివిధ అలంకారాల్లో స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. జనవరి ఒకటిన కూర్మావతారం, 2న వరాహావతారం, 3న నరసింహావతారం, 4న వామనవతారం, 5న పరశురామ అవతారం, 6న శ్రీరామావతారం, 6న బలరామావతారం, 8న శ్రీకృష్ణావతారంలో స్వామి వారు దర్శనమివ్వనున్నారు.

9న తెప్పోత్సవం,10న ఉత్తర ద్వార దర్శనం

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు డిసెంబరు 31 నుంచి నిర్వహించే వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా స్వామి వారికి జనవరి 9న పవిత్ర గోదావరి నదిలో తెప్పోత్సవం నిర్వహించనుండగా 10వ తేదీన శ్రీ వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తరద్వారంలో స్వామి వారు దర్శనమివ్వనున్నారు.

జనవరి 10 నుంచి రాపత్తు సేవలు

వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా జనవరి 10 నుంచి రాపత్తు సేవలు 20 వరకు నిర్వహించనున్నారు. 21 నుంచి మూడు రోజుల పాటు విలాసోత్సవాలు నిర్వహించనున్నారు. అదేవిధంగా జనవరి 26న శ్రీ సీతారామచంద్రస్వామి వారికి విశ్వరూప సేవ నిర్వహించనున్నారు.

రబీ సాగుపై స్పష్టత ఎప్పుడు?

- ప్రభుత్వ ప్రకటన కోసం అన్నదాతల ఎదురుచూపు

వైరా, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ ఆయకట్టులో యాసంగి(రబీ)సాగుకు నీటి సరఫరాపై స్పష్టతనిచ్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని అన్నదాతలు అసంతృప్తిగా ఉన్నారు. కనీసం రబీ సాగుకు నీటి సరఫరా గురించి స్పష్టమైన ప్రకటన చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులకు సమయమే లేకుండా పోయిందా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రబీ సాగునీటి విడుదలపై వెంటనే ప్రకటన చేయాలని అన్నదాతలు ఆశిస్తున్నారు. రబీ సీజన్ మొదలై రెండోనెల నడుస్తోంది. వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల ఆధునికీకరణ కోసం ఫేజ్-2లో రూ.42.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ ఆధునికీకరణ పనులకోసం ఆగస్టు తొమ్మిదిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఇప్పటికే ఈ నిర్మాణాలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయినట్లు సమాచారం.

ప్రభుత్వ స్పష్టతపైనే రబీ సాగు...

రూ.42.10కోట్లతో కుడి, ఎడమకాల్వల ఆధునికీకరణ పనులు చేయనున్నందున రబీలో ఈ రెండు కాల్వలకు సాగునీటి సరఫరాపై ప్రభుత్వం నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పష్టమైన ప్రకటన చేయాలని రైతులు కోరుతున్నారు. ఫేజ్-1లో దాదాపు రూ.65కోట్లు వెచ్చించి కుడి కాల్వలో ఏడుకిలోమీటర్లకుపైగా సిమెంట్ గైడ్‌వాల్స్‌ను నిర్మించారు. అక్విడెక్టులను పునర్నిర్మించారు. రిజర్వాయర్‌కు ఐదో అలుగును నిర్మించారు. ఇంకా 20కిలోమీటర్లకుపైగా కాల్వను ఆధునికీకరించాల్సి ఉంది. అలాగే ఎడమకాల్వలోని అక్విడెక్టులను పునర్నిర్మించి 9.33 కిలోమీటర్ల వరకు సిమెంట్ గైడ్‌వాల్స్‌ను నిర్మించారు. ఇంకా 8 కిలోమీటర్లకుపైగా కాల్వలను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఫేజ్-2లో కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టే అవకాశమున్నందున రబీలో సాగునీటి సరఫరా చేస్తారా..? లేదా అనే సందేహాలు రైతుల్లో నెలకొన్నాయి.

కటాఫ్‌గా సాగునీటి విడుదల చేస్తారా...?

కుడి, ఎడమకాల్వలకు కటాఫ్ పద్ధతిలో రబీకి సాగునీరు విడుదల చేస్తారా అనే దానిపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కుడికాల్వలో 8వ డిస్ట్రిబ్యూటరీ వరకు గైడ్‌వాల్స్ ఎడమకాల్వలో గరికపాడు లింక్‌కెనాల్ వరకు గైడ్‌వాల్స్ నిర్మించారు. అందువల్ల కుడి కాల్వకు కొష్టాల వరకు, ఎడమ కాల్వ 12వ డిస్ట్రిబ్యూటరీ నారపనేనిపల్లి వరకు రబీసాగులో నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అయితే స్నానాల లక్ష్మీపురం వద్ద వైరా నదిలో రూ.ఏడు కోట్ల పైచిలుకు నిధులతో చెక్‌డ్యాం నిర్మించనున్నందున ఈ రెండు కాల్వలకు కటాఫ్ పద్ధతిలో నీరు విడుదల చేస్తే ఆ నిర్మాణానికి ఆటంకం కలుగుతుందనే వాదన కూడా విన్పిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఫిబ్రవరి చివరివరకు సాగునీరు సరఫరాచేసి ఆ తర్వాత రెండు కాల్వలకు పూర్తిస్థాయిలో నీటిసరఫరా బంద్ చేసి గైడ్‌వాల్స్ పనులు చేపట్టవచ్చనే ఆలోచనలో అధికారులు ఉన్నట్టు సమాచారం.

ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలు...

ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయ సీజన్ రైతాంగాన్ని నష్టపెట్టింది. మొదట్లో తీవ్ర వర్షాభావంతో సేద్యం ఆలస్యమైంది. ఒక మోస్తరు వర్షాలు కురిసి పైర్లు వేసిన తర్వాత అవి తీవ్రంగా దెబ్బతిన్నాయి. వాటికి తోడు ప్రకృతి వైపరీత్యాలు రైతును కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. మరీ ముఖ్యంగా సెప్టెంబరులో పది రోజులు ఏకధాటిగా కురిసిన భారీవర్షాలు, వరదలతో పెసర, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరి పొలాలకు కూడా నష్టం వాటిల్లింది. చీడపీడలు సోకి వరిపైరులో ఎదుగుదల లోపించింది. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు కన్పించటం లేదు.

ఆ మూడు పంటలపైనే రైతుల ఆశలు...

వైరా ఆయకట్టు రైతులు తీవ్ర నీటిఎద్దడితో గతేడాది యాసంగి సేద్యానికి దూరంగా ఉండిపోయారు. ఈ ఏడాది ఖరీఫ్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ అడియాశలయ్యాయి. ఈ రబీలో వరి, మిర్చి, మొక్కజొన్న సేద్యంపైనే ఆశలు పెట్టుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పెసర, పత్తిపంటలు దెబ్బతినడంతో రైతులు చాలావరకు వాటిని దున్ని మొక్కజొన్న సాగు చేస్తున్నారు.ఈ పంటలు సాగుచేస్తే కనీసం ఏప్రిల్ వరకు సాగునీరు అవసరముంది. అలాగే యాసంగి వరి సాగుచేస్తే మే వరకు నీటి సరఫరా చేయాల్సి ఉంటుంది. ఎన్నెస్పీలో నీటి లభ్యత ఉన్నప్పటికీ వైరా కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టే అవకాశమున్నందున నీటి సరఫరా చేస్తారా..? లేదా అనే డోలాయమానంలో రైతులు ఉన్నారు. రబీ నీటి సరఫరాపై ఎలాంటి జాప్యం లేకుండా ప్రభుత్వం నుంచి స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, నీటిపారుదలశాఖ అధికారులు స్పష్టమైన ప్రకటన చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



వైరా రిజర్వాయర్



ప్రవచనం బోధిస్తున్న సాహితీ రత్న డాక్టర్ లక్ష్మణా చార్యులు

ప్రజలకు భక్తిమార్గం చూపటంలో


ఆళ్వార్లది విశిష్టపాత్ర..

- ద్వాదశ సూరి కార్యక్రమంలో వేద పండితులు
- ఖమ్మంలో ఘనంగా ప్రారంభం
- పలు రాష్ట్రాల నుంచి హాజరైన ఆళ్వార్లు

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలను భక్తిమార్గంవైపు నడిపించేందుకు ఆళ్వార్లు తమవంతుగా విశేష కృషి చేశారని పలువురు వేదపండితులు ప్రవచించారు.. ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంపురామాలయం లో ప్రారంభమైన ద్వాదశ సూరి కార్యక్రమంలో పలు ప్రాంతాలనుంచి హాజరైన వేదపండితులు తమ ప్రవచనాలను అందజేస్తూ భక్తి ఎంతకూ తరిగిపోని అమృతం లాంటిది అన్నారు. ఎంత సేవించినా మరింత కావాలనే తృష్ణను కలగజేస్తుందన్నారు. వేదాన్ని ప్రంచానికి మరింత చాటి చెప్పిన, సంస్కృతానికి విస్తృత ప్రాభవం కల్పించిన ఆళ్వార్లు భక్తి మార్గాన్ని మరింతపెంపొందించారన్నారు. ఆళ్వార్లు దైవభావనలకు , ఆధ్యాత్మికతకు అతిదగ్గరగా ఉంటారు కనుక ప్రజల్లో చాలా మంది ఆళ్వార్లను భక్తితో కొలుస్తారని చెప్పారు. ఆళ్వార్లు సైతం భక్తి, ముక్తి మార్గాలను ప్రజలకు మరింతగా వివరించారని చెప్పారు.. నాలుగు వేల పాశురాలుగా తమ కవిత్వం లో భక్తి తత్వాన్ని బలంగా చాటారన్నారు. ప్రజలను దైవత్వంవైపు నడిపేదే భక్తి మార్గం అని చెప్పారు.

ఘనంగా ప్రారంభం....

ఆళ్వార్ల వైభవ ప్రవచనాల కార్యక్రమం (ద్వాదశ సూరి) శుక్రవారం ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంపు రామాలయం (రామగిరి)లో ఘనంగా ప్రారంభమయ్యాయి. త్రిదండి చినజీయర్‌స్వామి ఆశీస్సులతో శ్రీవైష్ణవ సంక్షేమ సంఘం ఖమ్మంజిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటైంది. పన్నెండు మంది ఆళ్వార్ల విశిష్టత ఆధ్మాత్మిక సేవలను ప్రవచించేందుకు పలురాష్ట్రాల నుంచి ప్రముఖ వేద పండితులు హాజరయ్యారు. శ్రీవైష్ణవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేదాంతం రాఘవాచార్యులు, వేదావధాని కోదండ రామాచార్యులు కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఉదయం,సాయంత్రం రెండు సెషన్లుగా ఆధ్యాత్మిక ప్రవచనాలు కొనసాగాయి. మొదటిరోజున ఉదయపు ప్రవచనాలలో సాహితీ రత్న డాక్టర్ లక్ష్మణాచార్యులు (హైదరాబాద్) సరయోగి పోయ్ గై ఆళ్వార్ ఆధ్యాత్మితను పరిచయం చేశారు. పండిత రత్న డాక్టర్ ఎం తిరుమలిశై ఆళ్వార్ (విజయవాడ) భక్తిసారులు తిరుమలిశైఆళ్వార్ విశిష్టతపై ప్రవచనాన్ని అందించారు. సాయంత్ర ప్రవచనాలలో ఉపదేశ చూడామణి ఎం.కులశేఖరాచార్యులు (హైద్రాబాద్) కులశేఖరాళ్వార్ అనే అంశంపై ప్రవచించారు.విద్యా ప్రవీణ కె.లక్ష్మీనారాయణ (నెల్లూరు) మధురకవిఆళ్వార్‌పై ప్రవచనం అందించారు.



హాజరైన వేద పండితులు, భక్తులు

దళారులకు అమ్మి మోసపోవద్దు

జిల్లాలో 700 క్వింటాళ్ల కొనుగోళ్లు : డీఎస్వో చందన్‌కుమార్



ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎస్వో చందన్‌కుమార్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శుక్రవారం నాటికి 700 క్వింటాళ్ల సన్నధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలో సేకరించినట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ 500 బోనస్‌ను ప్రకటించి అమలు చేస్తుందని రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామని వీటిని రైతులు సద్వినియోగించుకోవాలన్నారు. కొనుగోలు చేసిన 24 గంటల్లో చెల్లింపులు కూడా చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీటీ రామచంద్రరావు తదితరులున్నారు.

18 ఏళ్లు నిండాయా...

(5వ పేజీ తరువాయి)

సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించి ఓటరుగా నమోదుకు యువతీయువకులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈనెల 9 శని, 10 ఆదివారం రెండు రోజుల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు అందుబాటులో ఉంటారు. 18ఏళ్లు నిండిన వారు. 2025 జనవరి నాటికి 18 నిండే వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతోపాటు తప్పుల సవరణ, చిరునామా మార్పులు చేపట్టనునానరు. దీనికోసం నిర్వహించే ఈ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. తప్పులు లేని, డబుల్ ఎంట్రీలు లేని ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే జాబితాలో డబుల్ ఎంట్రీలను, చనిపోయిన వారి పేర్లను తొలగించారు. ఓటుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను కూడా పూర్తిచేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో అందిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు.

మార్మోగుతున్న శరణుఘోష

(5వ పేజీ తరువాయి)

జిల్లా వ్యాప్తంగా ఇరవై వేలమంది వరకు దీక్షలు తీసుకునే సూచనలున్నాయని గురుస్వాములు అంచనా వేస్తున్నారు.

ఆధ్యాత్మిక వాతావరణం..

అయ్యప్పదీక్ష తీసుకున్న వెంటనే రోజువారి జీవన సరళికి భిన్నంగా ప్రత్యేక నియమాలను పాటించాలి కనుక దీక్షా పరులు ఆ మేరకు జీవన సరళిని సైతం మార్చుకోవటంతో వారి ఇంటాబయటా ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది. దీక్షలో భాగంగా మడి, శుచి వంటి పాటింపులకోసం కొందరు ఇంటికి దూరంగా వేరేచోట పీఠాలను ఏర్పాటు చేసుకొని అక్కడే ఉంటుండగా చాలామంది ఇళ్లల్లోనే ప్రత్యేక గదులను ఏర్పాటు చేసుకుంటున్నారు. వంట, ఆహారం, తదితర విషయాలలో ప్రత్యేకతను పాటించాల్సి ఉండటంతో ఆ మేరకు ఆచరిస్తున్నారు. చాలామంది మధ్యాహ్న భోజనం కోసం నగరంలో ఏర్పాటైన అన్నదాన కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. అయ్యప్ప సంకీర్తనా ప్రియుడు కావటంతో అయ్యప్పలు మనసులో ధ్యనించటం కాక భజనలకు ప్రాధాన్యం ఇస్తారు. ఒక్కరుగా కానీ మరికొందరితో కలిసి కానీ ఈ భజనలు, పడి పూజలు అయ్యప్ప పాటలను పాడుతుండటం, వంటివి ఆచరిస్తున్నారు.

ఉదయాన్నే గణపతి హోమం, అష్టాభిషేకం, మధ్యాహ్నం కలశపూజ, తదితర పూజలను ఆచరిస్తున్నారు.

అన్నదాన కేంద్రాలు..

అయ్యప్ప స్వామి భక్తులకు అన్నదానం చేసేందుకు ప్రత్యేక మంటపాలు ఏర్పాటయ్యాయి. దీక్షాపరులకు మధ్యాహ్న వేళలో ఇక్కడ ఉచిత భోజన సదుపాయాన్ని వారి దీక్షా నియమాలకు అనుగుణంగా అందిస్తారు. బైపాస్ రోడ్, ముస్తఫానగర్, వీడీవోస్ కాలనీ, పంపింగ్ వెల్ రోడ్ ప్రాంతాల్లో ఏర్పాటైన ఆధ్యాత్మిక కేంద్రాల్లో అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమాలను చేపడుతున్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12గంటల నుంచి 3.30వరకు ఈ అన్నదాన కేంద్రాలు సేవలందిస్తున్నాయి. ఒక్కో వేదికకు సంబంధించి కొంతమంది భక్తులు చందాలు వేసుకొని ఆ డబ్బును బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయటం ద్వారా వచ్చే వడ్డీతో అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమం 41రోజులపాటు కొనసాగనుంది.

దీక్షాదారుల సంఖ్య పెరిగింది..

మేకల హనుమంతరావు, ధర్మశాస్త అన్నదాన సేవాసమితి చైర్మన్

అయ్యప్ప దీక్ష ధరించే భక్తుల సంఖ్య ప్రతిఏడూ పెరుగుతోంది. ఖమ్మం నగరంలో గతేడాది 12వేలమంది వరకు అయ్యప్ప మాల ధరించగా ఈసారి 13వేలకు పెరగవచ్చని అంచనా ఉంది. 2012నుంచి మా సేవా కేంద్రం తరుపున అయ్యప్పలకు ప్రతిరోజు మధ్యాహ్నం అన్నదాన సదుపాయం కల్పిస్తున్నాం. మా అన్నదాన కేంద్రంలో ప్రతిరోజు పూజలు, భజనలతోపాటు 700 నుంచి 800 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నాం. కొంత డబ్బును బ్యాంకులో డిపాజిట్ చేసి వాటిపై వచ్చే వడ్డీతో ఈ సేవను కొనసాగిస్తున్నాం. బైపాస్ రోడ్‌లో అయ్యప్ప ఆలయం సైతం నిర్మిస్తున్నాం.



నాసిరకం చేపపిల్లల పంపిణీపై మత్స్యసంఘాల ఆగ్రహం

- చెరువులు అడుగంటే దశలో పిల్లలు ఎందుకంటున్న మత్స్యకారులు.



చేపలు పంపిణీ చేస్తున్న అధికారులు.

చంద్రుగొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారు కుటుంబాలు ఆర్థికంగా నిలబడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీ పథకం అధికారుల నిర్లక్ష్యంతో నీరు గారి పోతుందని మత్స్య సంఘాల నాయకులు ఆవేదనతో వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పలు చెరువులు, కుంటలకు చెందిన సొసైటీలకు గుట్టు చప్పుడు కాకుండా చేప పిల్లల పంపిణీ జరిగింది. అత్యంత నాసిరకం చేప పిల్లల పంపిణీపై మత్స్య సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అసలు ఇంత చిన్నసైజు పిల్లలు బ్రతకవని, బ్రతికినా చిన్న సైజు కాటంతో పెద్ద చేపలు మింగుతాయని మత్స్యకారులు తెలిపారు. చిన్నసైజుతో పాటు తక్కువ సంఖ్యలో పిల్లల పంపిణీ ఎప్పుడు జరగ లేదని, మూడవ వంతు మాత్రచే అందచేశారని మత్స్యకారులు వాపోతున్నారు.

చెరువులు ఎండిపోవే దశలో పిల్లల పంపిణీ ఎందుకు?

మత్స్య సొసైటీ చైర్మన్ లక్ష్మయ్య



చెరువులు, కుంటలు అడుగంటే దశలో చేప పిల్లల పంపిణీ చేయటం ఎమటని, వెంగళరావు సాగర్ ప్రాజెక్టు మత్స్య సొసైటీ చైర్మన్ పాండ్ల రామవులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. నాసిరకం పిల్లలు అందజేశారని, పంపిణీ సమయంలో పిల్లలు తీసుకునేందుకు నిరాకరించామని, పిల్లలు తీసుకోని పోయిన సంఘాలు రుసుము చెల్లించాల్సిందేనని అధికారులు బెదిరించారని అన్నారు. సంఘాలు లేని చెరువులకు కూడా పిల్లలను ఇస్తున్నారని, ఇదేమని కింది స్థాయి సిబ్బందిని అడిగితే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని వాపోయారు.

కులగణనను బాధ్యతగా నిర్వహించాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఖమ్మం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సర్వేకి కుటుంబ సమగ్ర సర్వే చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం, వెంకటగిరి పంచాయతి పరిధిలోని కోటనారాయణపురం గ్రామంలో శుక్రవారం కుటుంబ సమగ్ర సర్వే ను మంత్రి పొంగులేటి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు మరింత అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళిక రచనకు సర్వే అని ఎటువంటి అపోహలు లేకుండా సర్వేకు ప్రజలు సహకరించాలని, ప్రతి కుటుంబ, వార్డు, గ్రామం, నియోజకవర్గం, జిల్లా సమగ్ర సర్వే చేపట్టితే ఏ వర్గానికి ఏం కావాలో తెలుస్తుందన్నారు. ప్రభుత్వానికి ఆదిశగా చర్యలకు అవకాశం కలుగుతుందన్నారు. సమగ్ర సర్వే మొక్కుబడిగా కాకుండా క్షుణ్ణంగా చేయాలనే తలంపుతో ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుందన్నారు. అనంతరం ఎన్యూమరేటర్లకు సర్వే కిట్లను మంత్రి చేతులమీదుగా అందజేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా మంత్రి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, ఆర్డీవో నరసింహరావు, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీవో కుమార్ పాల్గొన్నారు.



కోటనారాయణపురం గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం

కల్లూరు, నంబరు 8 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని మినీ స్టేడియంలో శుక్రవారం రాష్ట స్థాయి పాఠశాలల ఖోఖో పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు ఆదివారం వరకు మూడు రోజులపాటు జరుగుతాయి. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి అండర్ 17 బాల బాలికల విభాగం నుంచి పది ఖోఖో జట్లకు గాను 120 మంది క్రీడకారులు పాల్గొననున్నారు. అందుకు సంబంధించి క్రీడా నిర్వహణకు గాను ప్రాంగణం ముస్తాబైంది. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి (జట్టును) జాతీయస్థాయిలో ఉత్తర ప్రదేశ్ అయోధ్యలో డిసెంబరు 5 నుంచి 8 తేది వరకు మూడు రోజుల పాటుగా జరగనున్న పోటీల్లో పాల్గొంటారని క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ పి వీరరాఘవయ్య తెలిపారు. ఖోఖో కోచ్‌లు 50 మంది మేనేజర్లు, 50 మంది న్యాయ నిపుణులు, 25 మంది వలంటీర్ల పర్యవేక్షణలో ఈ పోటీలు జరుగనున్నాయి. ఈ క్రీడల కన్వీనర్‌గా పి. నివేదిత, ఎస్‌జీఎఫ్ తరుపున కె. నర్సింహామూర్తి, స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా బొంతు శ్రీనివాసరావు, టెక్నికల్ అబ్జర్వర్‌గా కె. రాధాకృష్ణమూర్తి, జి. రమాదేవి, సీహెచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో జరుగుతాయిని ఆర్గజైజింగ్ సెక్రటరీ వీరరాఘవయ్య వివరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాలోని క్రీడకారులు తరలి రావటంతో మని స్టేడియం క్రీడలకు వన్నె తెచ్చెలా సుందరంగా ముస్తాబైంది.



ఖమ్మం జిల్లా ఖోఖో క్రీడాకారుల జట్టు

మధిరను సుందరంగా

తీర్చిదిద్దాలి..

(5వ పేజీ తరువాయి)

ఇబ్బంది లేకుండా మునిసిపల్ అధికారులతో కలిసి డిజైన్లను రూపొందించాలని ఇరిగేషన్ డీఈకి సూచించారు.

మహదేవపురం లిఫ్ట్‌ను జూలై కల్లా సిద్ధం చేయాలని, జాలిముడి కుడి, ఎడమ కాలువలను పరిశీలించి అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. మధిరకు మంజూరైన ఐటీఐ కాలేజీకి స్థలాన్ని ఎంపిక చేయాలని, అప్పటివరకు తరగతులు నిర్వహించేందుకు తాత్కాలికంగా బిల్డింగ్‌ను ఎంపిక చేయాలని తహసీల్ధార్ రాంబాబును ఆదేశించారు, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటికి హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని తహసీల్ధార్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులతోపాటు, ఐదు మండలాల తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలాలను రక్షించాలని తహసీల్దార్లకు సూచిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

మావోయిస్టుల కదలికలపై నిరంతర నిఘా

- భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్
- ఏడూళ్లబయ్యారం, కరకగూడెం పోలీస్ స్టేషన్ల సందర్శన


రాళ్లవాగు వంతెనను పరిశీలిస్తున్న ఎస్పీ

పినపాక/ కరకగూడెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో నిషేధిత సీపీఐ మావోయిస్టుల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. గురువారం పినపాక మండలంలోని ఏడూళ్లబయ్యారం, కరకగూడెం పోలీస్ స్టేషన్లను ఎస్పీ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పని చేసే పోలీస్ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ, మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకుని, అందుకనుగుణంగా పని చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు న్యాయం కోసం, తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే బాధితుల పట్ల, గౌరవంగా, బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో పని చేసే సిబ్బందికి పోలీస్ శాఖ తరఫున కేటాయించిన ప్రభుత్వ సామగ్రిని పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులను పరిశీలించి, వివరాలడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బంది వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. హోదాల వారీగా ఎవరికి కేటాయించిన విధులను వారు సమర్థవంతంగా నిర్వర్తించి, ఏజెన్సీ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాల్లోని యువతను చదువు, క్రీడలు, కెరీర్, ఉపాధి కల్పన వంటి అంశాల్లో పోలీస్‌లు ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం కరకగూడెం మండలంలోని కరకగూడెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. 1992 లో సెప్టెంబర్ 4 వ తేదీన మావోయిస్టులు పేల్చిన కలవలనాగారం గ్రామ శివారులోని రాళ్లవాగు బ్రిడ్జిని పరిశీలించారు. కరకగూడెం ఏజెన్సీ ప్రాంతం కావున ఇక్కడి సమస్యలు తెలుసుకుని ప్రజలకు సహాయసహకారాలు అందించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి, సహకరించేవారి పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడూళ్లబయ్యారం సీఐ వి వెంకటేశ్వరరావు, ఎస్సై రాజ్‌కుమార్, కరకగూడెం ఎస్ఐ రాజేందర్ టీఎస్‌పీఎస్ అధికారులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

పులి కనిపించిందనే ప్రచారంతో ఆందోళన

మధిర రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం వంగవీడు గ్రామంలోని శివారు పొలాల్లో చిరుత పులి సంచరించిదని జోరుగా ప్రచారం జరుగుతోంది. శుక్రవారం రాత్రి 7గంటల సమయంలో గ్రామానికి చెందిన ఓబుల సాయికిరణ్‌రెడ్డి తన పొలానికి వెళ్లి వస్తున్నాడు. మార్గంమధ్యలో వంగవీడు-రాయన్నపేట డొంక రోడ్డులో శ్మశాన వాటిక వద్ద పొలాల్లో చిరుత పులి కనిపించింది. దీంతో వీడియో చిత్రీకరించి సోషల్‌మీడియాలో పోస్టు పెట్టడంతోపాటు గ్రామపెద్దలకు సమాచారం అందించాడు. దీంతో గ్రామస్థులు ఒక్కసారి ఆందోళనకు గురయ్యారు. గ్రామ కాంగ్రెస్ నాయకుడు అయిలూరి సత్యనారాయణరెడ్డి ఫారెస్ట్ అధికారులకు అందించారు. ఈ విషయమై మధిరడివిజన్ ఫారెస్ట్ రేంజర్ బి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మైదాన ప్రాంతమైన మధిర మండలంలో చిరుతపులి సంచరించే అవకాశం లేదని, అడవి పిల్లి, హైనా వంటివి సంచరించి ఉండొచ్చని తెలిపారు. శనివారం గ్రామానికి వెళ్లి కాళ్ల ముద్రలు తీసుకుంటామని తెలిపారు.

రెండు బైకుల ఢీ: ఇద్దరికి గాయాలు

కొణిజర్ల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథన ప్రకారం వైరా వైపు నుంచి ఖమ్మం వైపు వెళుతున్న ద్విచక్రవాహనం, ఖమ్మం వైపు నుంచి ఏన్కూర్ వెళుతున్న మరో ద్విచక్రవాహనం రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఖమ్మం వైపు వెళుతున్న ద్విచక్రవాహనదారుడు నసీర్, ఏన్కూర్ వైపు వెళుతున్న మరో ద్విచక్రవాహనదారుడు ధరావతు ధనుష్‌కుమార్ ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 ద్వారా ఖమ్మం తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు.

పల్లెప్రకృతి వనం మొక్కల ధ్వంసం

తల్లాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం ముద్దునూరు గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి పల్లెప్రకృతి వనం మొక్కలను ధ్వంసం చేశారు. ఈమేరకు శుక్రవారం తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీ కార్యదర్శి యాకలక్ష్మి ఫిర్యాదు చేశారు. సుమారు రూ.80వేల మేరకు నష్టం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై తల్లాడ ఎంపీడీవో, ఎంపీవోలకు కూడా ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించారు.

అనారోగ్యంతో ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతి



ఖమ్మంక్రైం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. 2003 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ జాలాది పార్థసారథి (42) నగరంలోని అల్లీపురం జంక్షన్ సమీపంలో నివాసం ఉంటూ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు ఈనెల 5న హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. మృతుడు పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారని, ట్రాఫిక్ విధుల్లో కూడా చురుగ్గా ఉంటారని తోటి కానిస్టేబుళ్లు వాపోయారు.

ట్రాక్టర్ ఢీకొని గిరిజనుడి మృతి

అశ్వారావుపేట రూరల్, నవంబరు 8:(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని గిరిజనుడు మృతిచెందిన సంఘటన మండలంలో శుక్రవారం జరిగింది. మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన నారం గంగరాజు (56) మరో రైతు శ్రీరామూర్తితో కలిసి ద్విచక్ర వాహనంపై పొలానికి వెళ్లారు. పొలంలో పనులు అనంతరం ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. ఇదే సమయంలో ద్విచక్ర వాహనం ముందు అశ్వారావుపేటకు వెళుతున్న ట్రాక్టర్ ఒక్కసారిగా ఆగి వెనుకకు వచ్చింది. ఒక్కసారిగా ట్రాక్టర్ ఆగి వెనకకు రావటంతో ద్విచక్ర వాహనాన్ని తోలే శ్రీరామూర్తి ప్రాణరక్షణ కోసం పక్కకు దూకగా వాహనంపై ఉన్న గంగరాజును ట్రాక్టర్ బలంగా ఢీకొంది. ట్రాక్టర్ కింద పడిపోయి తీవ్రంగా గాయాలపాలైన గంగరాజును ఖమ్మం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు ఘటనకు సంబంధించి వివరాలు సేకరిస్తున్నారు. నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ను నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడి కుటుంబసభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పేరాయిగూడెం పంచాయతీకి చెందిన 26 ఏళ్ల వివాహిత శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు వివాహిత ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేదు. దీంతో భర్త సురేశ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

ఎరువుల దుకాణంలో చోరీ..


విచారణ చేస్తున్న ఏఎస్ఐ కోటేశ్వరరావు

జూలూరుపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ఎరువుల, పురుగుమందుల దుకాణంలో చోరీకి పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. దీంతో సదరు వ్యాపారి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి విచారణ చేపట్టారు. వెంగన్నపాలెం గ్రామంలోని అరుణ్‌సాయి ట్రేడర్స్ దుకాణం డోర్‌కి వేసిన తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు సీసీ కెమెరా కనెక్షన్ వైరును కట్ చేసి చోరీకి పాల్పడ్డారు. దుకాణంలోని మిరపతోటకు సంబంధించిన రూ.2లక్షల విలువ చేసే పురుగుమందులను ఎత్తుకెళ్లారు. ఇదే క్రమంలోకి గత 15 రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు చోరబడి రూ. లక్ష విలువ చేసే పురుగుమందులను తీసుకెళ్లారు. వ్యాపారి శిరంశెట్టి అన్వేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ కోటేశ్వరరావు విచారణ చేపట్టి వివరాలు నమోదు చేసుకున్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

జూలూరుపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాను ప్రేమించిన యువతితో కుటుంబసభ్యులు పెళ్లి చేస్తారో లేదోనని మనస్తాపానికి గురై మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన గుంటి కోటేశ్వరరావు(22) యువకుడు పురుగులమందు సేవించి ఆసుపత్రిలో చికిత్స పొందతూ మృతి చెందాడు. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కోటేశ్వరరావు మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన ఒక యువతిని కొన్నేళ్లుగా ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుని విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు చెప్పాడు. వారు కొన్ని నెలల తర్వాత వివాహం చేస్తామని చెప్పారు. కొద్దిరోజుల తర్వాత తన పెళ్లి చేస్తారో లేదోనని మనోవేదనకు గురై జీవితంపై విరక్తి చెంది కోటేశ్వరరావు ఈ నెల 6వ తేదీన గ్రామశివారులోని పాలగుట్ట వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. కుటుంబసభ్యులు చికిత్స కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టుల మృతి

దుమ్ముగూడెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్ జిల్లా ఊసూర్-బాసగూడ-పామేడు-టెర్రం అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో డీఆర్జీ, ఎస్టీఎఫ్, కోబ్రా, సీఆర్‌పీఎఫ్ బలగాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో రేఖపల్లి-కోమటపల్లి అటవీప్రాంతంలో పోలీసు, మావోయిస్టుల నడుమ ఎన్‌కౌంటర్ జరిగింది. సంఘటనా స్థలంలో యూనిఫాం ధరించిన ఇద్దరు మావోయిస్టులు ఒక ఎస్ఎల్ఆర్ తుపాకి, పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రి దొరికాయి. మృతుల వివరాల తెలియాల్సి ఉంది.

వీధి కుక్కల స్వైర విహారం

- గొల్లగూడెంలో శునకాలదాడిలో లేగదూడ మృత్యువాత

పాల్వంచ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ఏ వార్డులో చూసిన వీధి శునకాలు గుంపులు, గుంపులుగా సంచరిస్తున్నాయి. పిల్లలు, వృక్తులపై కూడ దాడిచేసి గాయపర్చిన ఘటనలు కోకొల్లలు. తాజాగా శుక్రవారం గొల్లగూడెంలోని అపార్టుమెంట్ల కూడలిలో ఉన్న ఖాళీ స్థలంలో గుంపులుగా ఉన్న వీధి శునకాలు ఓ రైతుకు చెందిన ఆవుదూడ (లేగదూడ) అటుగా రావడంతో దానిపై దాడి చేశాయి. లేగదూడను చంపి ఆపై పీక్కుతిన్నాయి. ఇది గమనించిన ఓ వ్యక్తి రాళ్లతో శునకాలను బెదిరించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. సంబంధిత అధికారులు స్పందించి వీధి శునకాలను నియంత్రించి ప్రజలకు వాటి భారీ నుంచి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

పినపాక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఉమ్మడి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గట్ల శ్రీనివాస్ రెడ్డి (48) గురువారం మృతి చెందారు. ఏడూళ్ల బయ్యారం క్రాస్‌రోడ్లోని ఓ పాఠశాల ముందు జరిగిన రోడ్డు ప్రమాదంలో గట్ల శ్రీనివాసరెడ్డి తీవ్రంగా గాలయాలయ్యాయి. తలకు బలంగా తాకడంతో హుటాహుటిన మణుగూరు 100 పడకల ఆసుపత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం తరలించి వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. గత మూడు రోజులుగా వైద్యం అందించినప్పటికీ పరిస్థితి విషమించి, గురువారం మృతి చెందాడు. శ్రీనివాసరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

కోడిపందాల స్థావరంపై పోలీసు దాడులు

అశ్వారావుపేట రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కోడిపందాల స్థావరాలపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మండలంలోని తిరుమలకుంట కాలనీ సమీపంలోని అటవీప్రాంతంలో కొందరు కోడిపందాలు నిర్వహిస్తున్నారు. సమాచారం మేరకు ఎస్ఐ శివరామకృష్ణ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో రూ.7500 నగదు, నాలుగు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ వివరించారు.

ఆటో ట్రాలీ బోల్తా.. వ్యక్తి మృతి

దమ్మపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ట్రాలీ ఆటో బోల్తాపడి వ్యక్తిమృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లచ్చాపురం గ్రామానికి చెందిన కలపాల కామేష్ (55) ఆటోలో పాల్వంచ వెళుతుండగా పార్కలగండి గ్రామ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈఘటనలో డ్రైవర్ కామేష్ తలకు బలమైన గాయాలు కావటంతో పాటు తీవ్ర రక్త స్రావమైంది. స్థానికులు గమనించి వెంటనే దమ్మపేట వైద్యశాలకు తరలించగా పరిశీలించిన డాక్టర్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కామేష్ కుమారుడు భాస్కరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో లారీడ్రైవర్ మృతి

తిరుమలాయపాలెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మాయిగూడెం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీడ్రైవర్ మృతిచెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం రామగుండం నుంచి ఖమ్మం వైపు ఫ్లై యాష్ లోడుతో వస్తున్న లారీ, ఖమ్మం నుంచి వరంగల్‌వైపు వెళుతున్న లారీ దమ్మాయిగూడెం సమీపంలోకి రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈఘటనలో లారీడ్రైవర్ ఎండీ మోహిన్(41) కరీంనగర్ వాసికి తీవ్రగాయాలు కాగా వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. మరో వ్యక్తి రామకోటయ్యకు కూడా తీవ్రగాయాలయ్యాయి. అతణ్ని కూడా ఖమ్మం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

ఆటో ప్రమాదంలో గాయపడ్డ ఉద్యోగులు

- తన వాహనంలో తరలించి మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే


క్షతగాత్రులను దగ్గరుండి ఆస్పత్రికి తరలిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం-చర్ల మార్గంలోని ఏపీ రాష్ట్రం ఎటపాక ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను దగ్గరుండి ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు. చర్ల పర్యటన ముగించుకొని భద్రాచలం వెళ్తున్న ఎమ్మెల్యే, గాయపడిన దుమ్ముగూడెం ఏవో నవీన్‌కుమార్‌ను తన వాహనంలో ఎక్కించుకోగా, మిగతా వారిని సైతం 108వాహనంలో తరలించారు. శుక్రవారం విధులు ముగించుకున్న ఏవో నవీన్‌కుమార్, ఏఈఓ హసీనా, దంతెనం పంచాయతీ కార్యదర్శి మాధవి తదితరులు ఆటోలో భద్రాచలం వెళ్తున్నారు. కుక్క ఎదురుగా రావడంతో ఆటో పక్కకు తిప్పిన క్రమంలో అది బోల్తా పడింది. దీంతో ఏవో నవీన్ కుమార్ తీవ్రగాయాల పాలవగా, మాదవి, హసీనా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అలాగే ఆటోలోని మరికొందరు ప్రయాణికులు సైతం గాయపడ్డారు. దుమ్ముగూడెం ఎంపీవో బద్ది రామకృష్ణ, పర్ణశాల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావులు సైతం క్షతగాత్రుల తరలింపులో సాయపడ్డారు. గాయాలపాలైన వారిని స్వయంగా తన వాహనంలో తరలించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సేవాభావాన్ని అక్కడి ప్రజానీకం ప్రశంసించారు.

హెవీవాటర్ ప్లాంట్‌ను సందర్శించిన బోర్డు సీఈ

అశ్వాపురం నవంబరు 8: మణుగూరు హెవీవాటర్ ప్లాంట్‌ను శుక్రవారం హెవీవాటర్‌బోర్డ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్(ముంబై) ఎస్. సత్యకుమార్ సందర్శించారు. హెవీవాటర్‌ప్లాంట్‌లో నిర్వహిస్తున్న షెట్‌డౌన్ పనులను పరిశీలించారు. అనంతరం హెవీవాటర్ ప్లాంట్‌కు సంబంధించి అమ్మగారిపల్లి సమీపంలో ఉన్న యాష్‌పండ్ వద్ద నిర్మించిన సీసీ రహదారులను ఆయన ప్రారంభించారు. మణుగూరు హెవీవాటర్ ప్లాంట్ లో త్వరలో నెలకొల్పే న్యూక్లియర్ రియాక్టర్ ఏర్పాటుకు సంబంధించి సీఈ అధికారులతో చర్చించినట్లు సమాచారం.

ఈ కార్యక్రమంలో బోర్డ్ ఆపరేషన్స్ డైరెక్టర్ వీవీఎస్‌పి ప్రసాద్, ప్లాంట్ జీఎం జగ్గారావు, డీజీఎంలు హెచ్‌కే శర్మ, జి. శ్రీనివాస్, జగన్నాథశర్మ, ఇంజనీర్లు పాల్గొన్నారు.


అవార్డులను ప్రదానంచేస్తున్న ఆర్టీసీ ఆర్ఎం సరిరాంనాయక్

ఆర్టీసీ ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలి

- ఆర్టీసీ ఆర్ఎం సరిరాంనాయక్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 8: (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులు నిబద్ధతతో పని చేసి సంస్థ ఆదాయం పెరిగేలా కృషి చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరాంనాయక్ సూచించారు. శుక్రవారం కొత్తగూడెం డిపో గ్యారేజ్‌లో ఖమ్మం రీజనల్ లెవల్ ప్రగతి చక్ర త్రైమాసిక అవార్డులను ప్రదానం చేసి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని డ్రైవర్లు, కండాక్టర్లు, మెయిన్టెన్స్ సిబ్బందిలో వారి వారి విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి పతకాలు అందిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధికి పని చేసి రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లా స్థాయిని తొలిస్థానంలో ఉంచేలా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం పవిత్ర, డిపో మేనేజర్లు దేవేందర్‌గౌడ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు కోటయ్యను ఆదర్శంగా తీసుకోండి

- జడ్పీ సీఈవో చంద్రశేఖర్

చంద్రుగొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అతి తక్కువ భూమిలో మునగతో పాటు మరో ఆరు రకాల పంటలను అంతర్ సాగు చేస్తున్న కోటయ్యను మిగతా రైతులు ఆదర్శంగా తీసుకొని పంటలు సాగుచేయాలని జిల్లా పరిషత్ సీఈవో చంద్రశేఖర్ కోరారు. కోటయ్య సాగు చేస్తున్న పంటలను సీఈవో పరిశీలించారు. రైతు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా మండలంలోని రావికంపాడు గ్రామానికి చెందిన కోటయ్య అనే రైతు తనకున్న భూమిలో 32 గుంటల్లో ఉపాధి హామి పథకంలో అందిన ఆర్థిక ప్రోత్సాహంతో తొలుత మునగ సాగు చేశాడు. మునగ మొక్కల మధ్య భూమి ఖాళీగా ఉండటాన్ని గమనించిన కోటయ్య అంతర్ సాగుగా వంగా, కాకర, చిక్కుడు, టమాటో, నేలచిక్కుడు, బెండ పంటలను సాగు చేశాడు. ఈ పంటలకు ఎటుంటి రసాయన మందులు వాడకుండా తన గేదల ద్వార లభించే సేంద్రియ ఎరువులనే వాడుతున్నాడు. ప్రస్తుతం మునగ పూత దశలో ఉంది.


ఉషా క్రీడాకారులను అభినందిస్తున్న డాక్టర్ సురేందర్

అంతర్‌జిల్లా ఉషూ క్రీడలకు ఎంపిక

చుంచుపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సబ్ జూనియర్ అంతర్ జిల్లా ఉషూ చాంపియన్ షిప్-2024 పోటీలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపిక అవడం హర్షించదగ్గ విషయమని ప్రభుత్వ వైద్యుడు సురేందర్ శుక్రవారం కొనియాడారు. శనివారం, ఆదివారం హైదరాబాద్ హస్తినాపురంలో జరిగే ఈ పోటీలలో 42కిలోల విభాగంలో బావన, శంషాద్ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు కోచ్ రఘు తెలిపారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు నవ్య



చుంచుపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల డిగ్రీ విద్యార్థిని కొండేటి నవ్య ఎంపికైంది. మణుగూరు ఏరియాలో సింగరేణి కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కొండేటి షడక్‌బాబు కుమార్తె నవ్య ఇటీవల కాకతీయ యూనివర్సిటీ అండర్-24 విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. ఈ ప్రదర్శనకు గాను జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడలకు ఎంపికైన ట్లు యూనివర్సిటీ ప్రతినిధులు ప్రకటించారు. చదువుతో పాటు క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తున్న నవ్య నేటి యువతరానికి ఆదర్శంగా నిలుస్తుందని సింగరేణి సంస్థ అధికారులు, దళిత సంఘ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన నవ్యను శుక్రవారం శాలువలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గంగాపురి శ్రీనివాస్, గోడ రమేష్, నాయకులు మోదుగు జోగారావు, నల్లగట్ల వెంకన్న, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ తదితరులు పాల్గొన్నారు.

'జపాన్' లీడర్‌షిప్ శిక్షణకు స్వప్న

- రామవరం ఎంసీహెచ్‌లో విధులు నిర్వహిస్తూ ఎంపిక
- 12వ తేదీ నుంచి 24 తేదీ పన్నెండు రోజుల పాటు ట్రైనింగ్



చుంచుపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మాతా, శిశు మరణాల రేటు శాతం తగ్గించడానికి భారతదేశం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లీడర్‌షిప్ ట్రైనింగ్‌కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నర్సింగ్ ఆఫీసర్ సుర్నపు స్వప్న ఎంపికైంది. ప్రపంచంలోనే టెక్నాలజీలకు నిలయం, మాతా శిశు మరణాల రేటు శాతం లేని దేశంగా పేరు ప్రఖ్యాతలు గడిచిన జపాన్ ఈ శిక్షణ కేంద్రానికి వేదిక కానుంది. జపాన్ దేశం మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కోసం చేపట్టిన విధి , విధానాలు, కార్యాచరణ, నియమాలను తెలుసుకునేందుకు ఏడుగురు సభ్యుల కూడిన భారతదేశ బృందం జపాన్‌కు వెళ్లనుంది. రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ ఆఫీసర్ల నైపుణ్యం - అనుభవం కలిగిన వారిని పంపించాలని నిర్ణయించారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఫ్యామిలీ అండ్ వెల్ఫేర్ కమిషనర్ ఆర్వీ కర్ణన్ భద్రాద్రి కొత్తగూడెం , వరంగల్ రెండు జిల్లాల్లో పని చేస్తున్న ఇద్దరు నర్సింగ్ ఆఫీసర్ల పేర్లను ప్రతిపాదించి పంపించారు. ఈ క్రమంలో జపాన్ ట్రైనింగ్ సెంటర్ ప్రతినిధులు ఈ ఇద్దరిని శుక్రవారం ఎంపిక చేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పన్నెండు రోజుల పాటు ఈ ట్రైనింగ్ కొనసాగుతుంది. భద్రాద్రి జిల్లా నుంచి ఎంపికైన నర్సింగ్ ఆఫీసర్ సూర్నపు స్వప్నను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం స్వప్న జిల్లాలోని కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్) పరిధిలోని రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో(ఎంసీహెచ్) విధులు నిర్వహిస్తోంది. నర్సింగ్ ఆఫీసర్ స్వప్నను తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్ అసోసియేషన్ జోనల్ అధ్యక్షురాలు శుభశంకరి, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతునేని సుదర్శన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధామోహన్ అభినందించి శాలువతో సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు లిక్కి బాలరాజు, నాయకులు వీరన్న, జునుమాల నగేష్, నర్సింగ్ ఆఫీసర్లు తదితరులు ఉన్నారు.


స్వప్నను అభినందిస్తున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతునేని సుదర్శన్, నర్సింగ్ జోనల్ అధ్యక్షురాలు శుభశంకరి


బాధ్యతలు స్వీకరిస్తున్న చారుగుండ్ల

టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన చారుగుండ్ల

పాల్వంచ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చారుగుండ్ల రమేష్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం హైదరాబాద్‌లో రిథమ్ కన్వెన్షన్‌లో జరిగిన సీఈసీ సమావేశంలో రాష్ట్ర నాయకులు కేవీ జాన్సన్, కోడూరి ప్రకాష్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా చారుగుండ్ల మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులు, ఆర్టిజన్ల సమస్యలు పరిష్కారం కావలంటే అన్ని సంఘాలు కలిసి పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. యూనియన్‌లో ప్రతి ఒక్కరినీ కలుపుకుని, అందరి సలహాలు సూచనలను పరిగణలోకి తీసుకుని యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు కమలాకర్, యూసఫ్, అజీజ్, ప్రభాకర్, జెన్కో కంపెనీ అధ్యక్షుడు రఘోత్తం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంబాబు, శ్రీనివాస్, తోట కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి KHAMMAM CITY
శనివారం 9 నవంబరు 2024
● ఖమ్మం ● రఘునాథపాలెం
● ఖమ్మం రూరల్
● తిరుమలాయపాలెం
● కూసుమంచి
● నేలకొండపల్లి ● కామేపల్లి
ఖమ్మం సిటీ
ZONE

రోడ్డు మీద చెత్త వేసినందుకు జరిమానా



ఖమ్మంటౌన్, నవంబరు8: రోడ్డు మీద చెత్త వేసిన వస్త్ర దుకాణ యజమానికి నగరపాలకసంస్థ సిబ్బంది శుక్రవారం రూ.2వేలు జరిమానా విధించారు. నగరంలోని 45వ డివిజన్‌లో బట్టల దుకాణం నిర్వహిస్తున్న సదరు వ్యక్తి శుక్రవారం రహదారిపై చెత్త వేయడాన్ని నగర పాలకసంస్థ సిబ్బంది గమనించారు. అతడికి రూ.2వేలు జరిమానా విధించారు. నగరంలో ఎవరైనా రహదారులపై చెత్త వేస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాట	40రూ.
వంకాయ	58
గుత్తి వంకాయ	60
బీరకాయ	48
పచ్చిమిర్చి	48
కాకరకాయ	30
బెండకాయ	48
పొట్లకాయ	50
దోసకాయ	48-68
చిక్కుడు	50
నాటుచిక్కుడు	140
గోరుచిక్కుడు	58
క్యాబేజి	34
దొండ	28-38
సొరకాయ	30
క్యారెట్	84
క్యాప్సికం	78
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	170
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

అభివృద్ధిలో ముందడుగు

» గతానికి నేటికీ ఎంతో తేడా
» నాడు రాళ్లు, ముళ్లకంపలు.. నేడు సెంట్రల్ లైటింగ్‌తో తళతళ
» అక్కడక్కడ రహదారులు, డ్రెయినేజీల నిర్మాణం అవసరం

డివిజన్ విజిట్

ఖమ్మంబైపాస్‌రోడ్డు,నవంబరు8(ఆంధ్రజ్యోతి): నగరంలోని 57డివిజన్ అంటే ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతం.. ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి చూస్తుంటే నాడు ఉన్న ప్రాంతానికి నేడు ఉన్న ప్రాంతానికి పోలికే లేదు. రాత్రి సమయాలలో ఆ డివిజన్‌లోని ప్రాంతాలకు వెళ్లాలన్నా స్థానికులు ఇబ్బందులు పడేవారు. అంతా రాళ్లు, ముళ్ల కంపే ఎక్కువగా ఉండేవి. కానీ ఇప్పుడు ఆడివిజన్ అంతా లైట్లతో, రోడ్లతో తళతళ మెరుస్తోంది. నగరంలో అన్ని ప్రాంతాలు ఒకలా ఉన్న ఈ డివిజన్‌లో కొన్నిప్రాంతాలు వెనుకబడే ఉన్నాయి. ఈ డివిజన్‌లో కొన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరగ్గా, మరికొన్ని ప్రాంతాల్లో ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉంది. గతంలో ఆప్రాంతంలో తాగునీటి సమస్య బాగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ సమస్య ఎక్కడా కూడా లేదు. రహదారులు, డ్రెయినేజీలు నిర్మించాల్సి ఉంది. గతంలో నిర్మించిన డ్రెయిన్లు మురుగు నీరు పారించకపోవడంతో వాటిలో అంతా చెత్త, మట్టి చేరాయి ప్రస్తుతం వాటికి మరమ్మతులు చేయిస్తున్నారు. నూతన డ్రెయిన్ల నిర్మాణం చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, సెంట్రల్ లైటింగ్‌తో ఈడివిజన్ అభివృద్ధి వైపు పయనిస్తుంది.

ఇవి ప్రధాన సమస్యలు

డివిజన్‌లో ఇంకా కొన్ని ప్రాంతాల్లో రహదారులకు సీసీరోడ్లు నిర్మించాల్సి ఉంది. ప్రధాన రహదారులతో పాటు లోపలకి ఉన్న ప్రాంతాలలో రోడ్లు నిర్మించి డ్రెయినేజీలు నిర్మించాల్సి ఉంది. గతంలో కొంతవరకు నిధులు మంజూరు కాకపోవడంతో అభివృద్ధి నిలిచిపోయింది. ఇటీవల కార్పొరేటర్ మహ్మద్ రఫీదాబేగం మంత్రులకు సమస్యలను వివరించారు. ఈనేపథ్యంలో రూ.6కోట్ల ఎల్ఆర్ఎస్ నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో పలు ప్రాంతాలలో సీసీ రోడ్ల నిర్మాణాలు, నూతనంగా డ్రైనేజీల నిర్మాణం చేస్తున్నారు.

డివిజన్ స్వరూపం

విస్తీర్ణం: సుమారు మూడు కిలోమీటర్లు
జనాభా: సుమారు 9800 మంది, సుమారు 5500మంది
డివిజన్‌లోని ప్రాంతాలు: రమణగుట్ట, వికలాంగుల కాలనీ, వడ్డెర కాలనీ, రెహమత్‌నగర్, ఎస్టీ కాలనీ, జగజ్జీవన్‌రావు కాలనీ, హనుమాన్ నగర్
కార్పొరేటర్: మహ్మద్ రఫీదాబేగం
ఫోన్ నంబర్: 94901 88786



కాలనీల్లో విశాలమైన రహదారులు



ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లు

డివిజన్ రూపులు మారాయి

కార్పొరేటర్: మహ్మద్ రఫీదాబేగం



గతంలో ఉన్న 57వ డివిజన్‌కు ఇప్పుడున్న డివిజన్‌కు చాలా తేడా ఉన్నది. గతంలో నిధులు రాకపోవడంతో కొన్ని ఇబ్బందులు జరిగాయి. ఇప్పుడు నిధులు మంజూరయ్యాయి. మళ్లీ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి నిర్మాణ పనులను ప్రారంభించాం. ఇంకా అభివృద్ధి జరగాల్సి ఉంది.

పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు నిర్మించాలి

ఎస్‌కె గఫూర్,స్థానికుడు



డివిజన్ గత ఏడాది నుంచి అభివృద్ధి జరుగుతుంది. పలు చోట్ల రోడ్లు నిర్మిస్తున్నారు. పలు ప్రాంతాల్లో రోడ్లు లేక ఇబ్బందులు ఉన్నాయి. ఇంకా పూర్తి స్థాయిలో రహదారులు ఏర్పాటు చేయాలి. అదేవిధంగా కొన్ని చోట్ల నీటి పైప్‌లైన్ సమస్య ఉంది. పైపులు ఏర్పాటు చేసి ఈసమస్య కూడా వెంటనే పరిష్కరించాలి.

డ్రెయిన్లను శుభ్రం చేయాలి

తోడేటి రామారాజు స్థానికుడు



ఇప్పుడు నిర్మిస్తున్న డ్రెయినేజీలు బావున్నాయి. కానీ గతంలో నిర్మించినవి అస్తవ్యస్తంగా ఉన్నాయి. డ్రెయినేజీల్లో మట్టి చేరి పూడిపోయాయి. ఆ నిర్మాణాలు కూడా సరిగ్గా లేవు. వాటిలో మురుగు పారటం లేదు. వాటిని శుభ్రం చేపించి, మురుగు నీరు పోయాలా చేయాలి. అంతర్గత ప్రాంతాల్లో డ్రెయినేజీలు నిర్మించాలి.

సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	అపుడో ఇప్పుడో ఎపుడో
ఆదీత్య:	క
తిరుమల:	దేవర
సినీ గెలాక్సీ:	ధూంధాం

ప్రజలనుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు

» నగర పాలకసంస్థ సహాయ కమిషనర్ అహమ్మద్ షఫీయుల్లా

ఖమ్మంటౌన్, నవంబరు8: పారిశుధ్య నిర్వహణపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే పారిశుధ్య జవాన్లతో పాటు సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని నగరపాలకసంస్థ సహాయ కమిషనర్ అహమ్మద్ షఫీయుల్లా హెచ్చరించారు. శుక్రవారం ఆయన నగరంలోని 24,46,48,53 డివిజన్లలో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణను తనిఖీ చేశారు. సదరు డివిజన్లలో మురుగు కాలువలను తీయటం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, మళ్లీ ఇటువంటి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. డివిజన్‌లో ఎంతమంది కార్మికులు పని చేస్తున్నారు, ఏఏ ప్రాంతాల్లో పనిచేస్తున్నారు, తదితర వివరాలను సహాయ కమిషనర్ పరిశీలించారు. మురుగుకాలువలను శుభ్రపరిచి తరువాత సమీపంలోని ఇంటి యజమానులతో సంతకాలు తీసుకోవాలని జవాన్లను ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం పారిశుధ్య నిర్వహణ చేయాలని సూచించారు.



పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలిస్తున్న షఫీయుల్లా

నేడు నేలకొండపల్లిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేలకొండపల్లి,నవంబరు8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తకొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ ఆపరేషన్స్ రామారావు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తకొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నేలకొండపల్లి, కొత్తకొత్తూరు, పాతకొత్తూరు, తిరుమలాపురం, పైనంపల్లి, బోదులబండ, రామచంద్రాపురం, అనంతనగర్, కోరట్లగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి, విద్యుత్ అధికారులు, సిబ్బందికి సహకరించాలని ఏఈ రామారావు ప్రకటనలో కోరారు.

ఐటీఐ కాలేజీ ఏర్పాటు చేయాలి

తిరుమలాయపాలెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోప్రభుత్వ ఐటీఐ కాలేజీ ఏర్పాటు చేయాలని విపక్ష నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం తిరుమలాయపాలెంలో అఖిలపక్ష సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ తిరుమలాయపాలెంలోని 254 సర్వేనెంబరులో ఉన్న ప్రభుత్వభూమి అన్యాక్రాంతం కాకుండా ఐటీఐ కాలేజీ నిర్మించాలన్నారు.

ఖమ్మం చేరుకున్న సైకిల్ యాత్ర

ఖమ్మంఖానాపురంహవేలినవంబరు8(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని షాతాపూర్ నుంచి ఒరిస్సా వరకు సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న శ్రీశైలనేలే, విట్టల్‌ఖరకు శుక్రవారం ఖమ్మం నగరానికి చేరుకున్నారు. వీరిని నగరంలోని అన్నం ఫౌండేషన్ ఛైర్మన్ అన్నం శ్రీనివాసరావు కలిసి వారితో మాట్లాడారు. 10సంవత్సరాల నుంచి కేవలం పాలు, అరటిపండ్లతోనే జీవిస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలలను సందర్శించిన ఏఎంఓ

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు8(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు పాఠశాలలను విద్యాశాఖ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి కేశవపట్నం రవికుమార్ సందర్శించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాండురంగాపురం, క్రైకొండాయగూడెంను సందర్శించారు.

ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనివ్వండి

ఎన్జీవోలతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి పరిచి సౌకర్యాలు కల్పించడంలో స్వచ్ఛంద సంస్థలు భాగాస్వాములు కావాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శుక్రవారం విద్యాశాఖకు సహకరిస్తున్న ప్రభుత్వేతర సంస్థల (ఎన్జీఓలు) ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలను ఎన్జీఓల భాగస్వామ్యంతో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎంబీబీఎస్ సీటు సాధించిన పేద విద్యార్థికి హెల్పింగ్‌హాండ్స్ పురుషోత్తమరావు కలెక్టర్ చేతుల మీదుగా చెక్ అందించారు.

సీతారామ ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయాలి

సీపీఎం మండల కార్యదర్శి

కామేపల్లి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): సీతారామా ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అంబటి శ్రీనివాసరెడ్డిప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కామేపల్లిలో సీపీఎం పార్టీ కార్యాలయంలో దుగ్గి క్రిష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సమావేశంలో నాయకులు వింజం నాగభూషణం, బాల క్రిష్ణ, డేగ రాంబాబు, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

సీఎం జన్మదిన వేడుకలు



దుప్పట్లు అందజేస్తున్న యుగంధర్, శరత్

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు8 (ఆంధ్రజ్యోతి):అన్నివర్గాలప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. 50వ డివిజన్ కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు.జీవనసంధ్య వయో వృద్ధుల ఆశ్రమంలో కేక్‌కట్ చేసి, దుప్పట్లు, ఇతర వస్తువులను పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రఘు, నాని, ఇసాక్, రూపక్, పవన్, వేల్పుల రామకృష్ణ, కోట్టే చార్లిస్, పెరుమళ్ల నరేష్ పాల్గొన్నారు.

పేదలకు మంచి విద్య అందించడమే లక్ష్యం

» రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): పేదలకు మంచి విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కార్పొరేషన్ పరిధిలోని రామన్నపేటలోపర్యటించారు.రామన్నపేట ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 8 నుంచి 10 వ తరగతి చదువుతున్న బాలికలకు పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సైకిల్‌లను పంపిణీ చేశారు. పాలేరు నియోజకవర్గం పరిధిలో దూర ప్రాంతం నుంచి వచ్చి చదువుకునే బాలికల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీటిని అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రతీ మండలంలో మోడల్ సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని అన్నారు. నేలకొండపల్లి మండలంలో జిల్లా పరిషత్ పాఠశాలలో తక్కువ విద్యార్థులు ఉండడం గమనించానని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని మంత్రి జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈవో సోమశేఖరశర్మ, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావుపాల్గొన్నారు.

హాస్టల్ సందర్శన

శుక్రవారం మంత్రి దానవాయిగూడెం సాంఘీక సంక్షేమ హాస్టల్‌ను సందర్శించి డైనింగ్ టేబుల్‌లు, కుర్చీలను అందజేశారు. వరదల సమయంలో ప్రిన్సిపాల్‌తో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ వరద ప్రభావిత చర్యలు తీసుకున్నామని, దీనికి కృషి చేసిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను మంత్రి అభినందించారు. విద్యుత్ సరఫరా, కాంపౌండ్ వాల్ సమస్య పరిష్కారానికి నిధులు అందజేస్తామన్నారు. అనంతరం మంత్రి విద్యార్థినులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ విజయదుర్గ, డీసీవో రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సైకిళ్లు అందజేసిన మంత్రి పొంగులేటి

సర్వే స్టిక్కరింగ్‌లో వెనుకబాటు

» ఎట్టకేలకు కొలిక్కి వచ్చిన ఉద్యోగుల నియామకం

ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సమగ్ర సర్వేకు సిబ్బంది కేటాయింపు ఎట్టకేలకు మూడో రోజు కొలిక్కి వచ్చింది. హైదరాబాద్, వరంగల్ వంటి మహానగరాలో ఇంటింటి సర్వే వేగంగా జరుగుతుండగా ఎన్యూమరేటర్ల కొరత కారణంగా కేఎంసీలో వెనుకబడింది. అయితే శుక్రవారం మెప్మా ఆర్పీలు 157, ఎస్‌హెచ్‌జీలు 210, విద్యాశాఖ 307, అంగన్వాడీలు 207, ఆశలు 84 మంది హాజరు కావటంతో ఎన్యూమరేటర్ల కొరత తీరింది.

32.98శాతం స్టిక్కరింగ్

ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 1,68,875 నివాసాలు అధికారికంగా నమోదు జరిగాయి. ఇంటినెంబర్లు లేని నివాసాలు మరో 10వేలకు పైగా ఉంటాయి. సర్వే కోసం 965 ఎన్యూమరేటరీ బ్లాక్‌లుగా విభజన చేశారు. 26 మంది పర్యవేక్షకులతో ఇంటింటి స్టిక్కరింగ్ ప్రారంభించారు. గురువారం వరకు 429 మంది ఎన్యూమరేటర్లు మాత్రమే పాల్గొనటంతో లక్ష్యం వెనుకబడింది. శుక్రవారం మాత్రం 965 మంది హాజరు కావటంతో మొత్తం 55,697 నివాసాలకు స్టిక్కరింగ్ చేశారు. 32.98శాతం లక్ష్యం సాధించారు. మరో 48గంటల్లో ఖమ్మం నగరంలో స్టిక్కరింగ్ పూర్తి కావాల్సి ఉంది.

సర్వే విధులకు కుటుంబ సభ్యులు

సర్వేకు ఎన్యూమరేటర్ల కొరత ఏర్పడటంతో ఖమ్మం నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు ఏకంగా వారి భార్యబిడ్డల జాబితాలను నమోదు చేయించి సర్వేకు పంపారు. వారికి అనుకూలమైన ప్రాంతాలను ఎంపిక చేసుకొని మరీ సర్వే కేటాయించటం పలు విమర్శలకు దారితీసింది. కాగా ఇంటింటి సర్వేను ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజ పరిశీలించారు.

నేటినుంచి తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ సమావేశం

తిరుమలాయపాలెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఏపీ రాష్ట్రాల పంచాయతీరాజ్ చాంబర్ సమావేశం నేడు, రేపు ఖమ్మంలోని కోణార్క్ హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ గౌరవ అధ్యక్షుడు పురసులూరి నరేందర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తెట్టెలపాడులో విలేకరులతో మాట్లాడుతూ ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా పంచాయతీరాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు యలమంచిలి బాబురాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణరెడ్డి పాల్గొంటారన్నారు.

షీటీమ్స్‌తో నిరంతరం నిఘా

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): షీటీం పోలీసులు విద్యాసంస్థల వద్ద, రద్దీ ప్రదేశాల్లో సివిల్ డ్రస్‌ల్లో నిత్యం తిరుగుతూ నిఘా ఉంటుందని షీటీం సీఐ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీటీంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, బాలికలు, విద్యార్థినిలు వేధింపులకు గురైతే వెంటనే జిల్లా షీ టీమ్ నెంబర్ 8712659222 లేదా డయల్ 100 కు ఫిర్యాదు చేయాలని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు8 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2024 హిందీ సర్టిఫికెట్ల పరిశీలనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఇద్దరు ప్రధానోపాధ్యాయులను ఏకపక్ష నిర్ణయంతో డీఈవో తీసుకున్న నిర్ణయం సరైంది కాదని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ స్టేట్ గెజిటెడ్ మాస్టర్స్ అసోషియేషన్ జిల్లా కమిటీ డీఈవోకు వినతిపత్రం అందించారు. డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన విధులు ప్రధానోపాధ్యాయులకు సంబంధంలేదని, డీఈవో సూచనల మేరకు ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారని, సర్టిఫికెట్ల పరిశీలన చేశారని వారు పేర్కొన్నారు.

'విజయ'లో ఫ్రెషర్స్ డే



కొణిజర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తనికెళ్ల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థుల ఆట, పాటలు ఆకట్టుకున్నాయి. ఫ్రెషర్స్ సందర్భంగా కళాశాల ఛైర్మన్ ఉషాకిరణ్‌కుమార్, వైస్‌ఛైర్మన్ పారుపల్లి విజయలక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణను అలవరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ అయేషాతరుణం, డీన్ శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఫరీద్‌బాబా పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం

ఆటో కార్మికులకు నిత్యవసరాల పంపిణీ

పట్టణంలో భారీ ర్యాలీ

సత్తుపల్లిలో ఘనంగా ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకలు

సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



ఆటో కార్మికులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగంపై దృష్టి సారించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పేద, మధ్యతరగతి వారి చదువు కోసం పెద్దపీట వేస్తున్నారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మార్ గార్డెన్స్ నుంచి జేవీఆర్ ప్రభుత్వ కళాశాల వరకు వేలాది ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ తీశారు. భారీ కేక్ కేట్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. 1500 మంది ఆటో కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1200విలువైన నిత్యావసర సరుకులను పంపిణీ చేసిన అనంతరం తమ కుమార్తె స్వర్గీయ ఆషా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆషా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. అంతకముందు ఆమె మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఏకైక సీఎం రేవంతేనన్నారు. స్కూల్, కళాశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తుందని, మెస్, కాస్మోటిక్స్ చార్జీలను పెంచిందన్నారు. 10ఏళ్ల నుంచి డీఎస్సీ జరపలేదని, మెగా డీఎస్సీ ద్వారా 11,500టీచర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు 12వేల మందికి ఉపాధ్యాయులు, పీఈటీలను పదోన్నతులు ప్రభుత్వం కల్పించిందన్నారు. ఏక కాలంలో రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మత్స్యకారులకు చేపల పంపిణీ చేశామన్నారు. జేవీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో రహదారి నిర్మాణం, స్టేడియం నిర్మాణం, కొత్త కళాశాల భవనం నిర్మిస్తున్నామన్నారు.

తల్లిదండ్రులు ఆశయాలకు అనుగుణంగా మంచిగా చదువుకోవాలని, ఇంతటి అభివృద్ధి చేస్తున్న మమ్మల్ని, ఈ ప్రభుత్వాన్ని వచ్చే ప్రతి ఎన్నికలలో ఆశీర్వదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆటో కార్మికులు, మహిళ, యూత్, ఎన్ఎస్‌యూఐ నాయకులతో పాటు అభిమానులు పాల్గొన్నారు.

కులగణన చరిత్రాత్మకం: ఎమ్మెల్యే రాందాస్ నాయక్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే కనీవినీ ఎరుగని రీతిలో తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల) దేశంలోనే ఓ చారిత్రాత్మకమైందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. వైరా మండలంలోని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో శుక్రవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎమ్మెల్యే ప్రారంభించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మది నుంచి వచ్చిన కులగణన సర్వేను మొదటిగా దేశంలోనే కనీవినీ ఎరుగని రీతిలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. సర్వేకు సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారు. కాంగ్రెస్ సహా అన్ని పార్టీల వారు, అన్నిసంఘాలు, వర్గాల వారు ఈ సర్వేకు సహకరించాలని సూచించారు.

గురుకుల విద్యాలయాన్ని సందర్శన

వైరాలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో ఎమ్మెల్యే గురుకులాన్ని సందర్శించి విద్యార్థినులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకుగానూ మెస్, ఇతర చార్జీలు పెంచిందని ఎమ్మెల్యే వివరించారు. ఆతర్వాత గురుకులం ఉపాధ్యాయ బృందంతో ఎమ్మెల్యే సమావేశమై అక్కడ స్థితిగతుల గురించి సమీక్షించారు. ఇంకా పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో కూడా ఎమ్మెల్యే పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాంబాబు, తహసీల్దార్, ఎంపీడీవో కేవీ.శ్రీనివాసరావు, సరస్వతీ, ప్రిన్సిపాల్ బి.సమత, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, నాయకులు దొడ్డా పుల్లయ్య, మల్లు రామకృష్ణ, దాసరి దానియేలు, సూరంపల్లి రామారావు, మట్టూరి వెంకటేశ్వరరావు, రాంపూడి రోశయ్య, పొదిల హరినాథ్, పణితి సైదులు, పమ్మి అశోక్, బోళ్ల గంగారావు, బీడీకే.రత్నం, పాలేటి నర్సింహారావు, చింతనిప్పు మాధవరావు, శీలం నాగిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, షేక్.సైదా, పొట్టపల్లి శ్రీను, అడుసుమల్లి గణేష్, కన్నెగంటి నగేష్, పల్లపు కొండలు పాల్గొన్నారు.

లింక్ రోడ్డుకు నిధుల మంజూరు

కొణిజర్ల/వైరా, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని కొణిజర్ల మండలం లాలాపురం నుంచి వైరా శాంతినగర్ వరకు లింక్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ శుక్రవారం ఆరోడ్డును పరిశీలించారు. వైరా మునిసిపాలిటీ 19వ వార్డు లాలాపురం నుంచి ఏడోవార్డులోని శాంతినగర్ వరకు జాతీయ ప్రధాన రహదారిని అనుసంధానం చేస్తూ ఉన్న లింక్ రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. ఆ రోడ్డు నిర్మాణానికిగానూ అవసరమైన శంకుస్థాపన కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

డీఎండ్‌హెచ్‌వో కళావతిబాయి

బోనకల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేలా వైద్య సిబ్బంది అంకితబావంతో పని చేయాలని డీఎండ్‌హెచ్‌వో కళావతిబాయి ఆదేవించారు. స్థానిక పీహెచ్‌సీని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణతో పాటు ఓపీ వివరాలను పరిశీలించారు. రోజువారి ఆసుపత్రికి వచ్చే వారి వివరాల రిజిస్టర్‌ను చూశారు. మందుల పంపిణీ, స్టాక్ వివరాలను రాసే ఎంట్రీ బోర్డును పరిశీలించారు. ప్రసవాల కోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణీలతో మాట్లాడారు. ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించేలా కృషి చేయాలన్నారు. రోజువారీ డ్రగ్ స్టాక్ వివరాల ఎంట్రీ బోర్డును అప్‌డేట్‌గా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కావ్య, సిబ్బంది ఉదయశ్రీ, రాధాలత తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

మధిరరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ జడ్పీఛైర్మన్, జిల్లా బీఆర్ఎస్ నాయకుడు లింగాల కమల్‌రాజ్ విమర్శించారు. మధిర మండలం దెందుకూరులో కనకదుర్గా కాటన్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటుచేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం బీఆర్ఎస్ నాయకుల బృందం పరిశీలించింది. కేంద్రంలోని రైతులతో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. కమల్‌రాజ్ మాట్లాడుతూ పేరుకే సీసీఐ కేంద్రాలు ఏర్పాటుచేశారని పదిరోజులవుతున్నా ఒక్క పత్తి బస్తా కూడా కొనుగోలు చేయలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, కటికల సత్యనారాయణరెడ్డి, కపిలవాయి జగన్మోహన్‌రావు, శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబసర్వేకు ప్రజలు సహకరించాలి

ఎమ్మెల్యే రాగమయి

పలు మండలాల్లో

ఎన్యూమరేటర్లకు శిక్షణ



బోనకల్‌లో ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో

కల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పంచాయతీ పరిధిలోని ఖానాఖాన్‌పేట గ్రామంలో శుక్రవారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పారంభించారు. ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే జరగనున్నదని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించటానికి ఈ సర్వే జరుగుతుందన్నారు. ఈ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే క్షేత్ర స్థాయిలో చేపట్టిన ఇంటింటా సర్వేను పరిశీలించటమే కాకుండా ఎన్యూమారేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పి సాంబశివుడు, ఏఎంసి ఛైర్మన్ బాగం నీరజాచౌదరి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, పంచాయతీ ఈఓ నాగేశ్వరరావు సూపర్‌వైజర్లు పి స్వరూప, భవానీ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే పటిష్టంగా చేపట్టాలి

కారేపల్లి (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి సర్వేను ఎన్యూమరేటర్లు పటిష్ఠంగా చేపట్టాలని, ఎలాంటి ఒడిదుడులు లేకుండపూర్తిచేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ కె.నవీన్‌బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఎన్యూమరేటర్ల శిక్షణశిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి ఇంటింటి సమగ్రసర్వేను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ, ఎంఈవో జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేపై శిక్షణ

తల్లాడ (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని రైతువేదికలో శుక్రవారం కులగణన సర్వేపై ఎన్యూమరేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఏ.వనజ, ఎంపీడీవో ఎం.చంద్రమౌళి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో కొండపల్లి శ్రీదేవి, ఎంఆర్ఐ భాస్కర్, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

బోనకల్ (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుల గణన సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్ పున్నమ్ చందర్, ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంఈవో దామాల పుల్లయ్యలు సూచించారు. స్థానిక రైతు వేదిక కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎన్యూమరేటర్ల శిక్షణా సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిని సందర్శించి పూర్తి వివరాలను సర్వేలో నమోదు చేయాలన్నారు. సర్వేను విజయవంతంగా పూర్తి చేయాల్సిన బాధ్యత అందరి పై ఉందన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

కొణిజర్ల, (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సమగ్రసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌పీవో రాంబాబు, తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్ తెలిపారు. మండల పరిధిలోని తనికెళ్ల రైతువదిక నందు ప్రాజెక్టర్ ద్వారా సర్వే నిర్వహించనున్న ఎన్యుమరేటర్‌లకు, సేపర్‌వైజర్‌లకు, స్థానిక అధికారులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం మెటీరియల్‌ను ఎన్యుమరేటర్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రోజారాణి, ఏఎస్‌వో తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తుపల్లిరూరల్/తల్లాడ/పెనుబల్లి/ముదిగొండ/వైరా/ నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఐపీడీఎస్ 33/11 కేవీ పరిధి, తల్లాడ విద్యుత్ సబస్టేషన్, పెనుబల్లి మండలం గౌరారం సబ్‌స్టేషన్ పరిధి, ముదిగొండ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి, వైరా, పట్టణ, గరికపాడు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని ఏఈలు శుక్రవారం ఓ ప్రకటలో తెలిపారు.

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సరఫరా నిలిపివేస్తున్నా మన్నారు. ఆయా సబ్‌స్టేషన్ పరిదిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైద్య విద్యార్థి కీర్తికి మాజీ ఎమ్మెల్యే సండ్ర సన్మానం

తల్లాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో నిరుపేద దళిత కుటుంబంలో జన్మించి అత్యంత ప్రతిభతో గాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన ఎక్కిరాల కీర్తిని శుక్రవారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సన్మానించారు. భవిష్యత్‌లో ఉన్నత విద్యను పూర్తిచేసి పేదలకు వైద్యసేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ తల్లాడ, పెనుబల్లి మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, కనగాల వెంకట్రావ్, మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్‌లాల్, నాయకులు అయిలూరి శివారెడ్డి, పోతురాజు వెంకటయ్య పాల్గొన్నారు.

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



వైరాలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే



తల్లాడలో..



కారేపల్లిలో కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎర్రుపాలెంలో..

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సొసైటీ గోదామును ప్రారంభిస్తున్న భట్టి

చింతకాని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సంక్షమమే ప్రధాన లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకుసాగుతున్నట్లు, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ఒక్క నిమిషం కూడా వృథా చేయకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పాలన కొనసాగిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగిలిగొండ, రేపల్లెవాడ, జగన్నాథపురం, పందిళ్లపల్లి గ్రామాల్లో రూ.22.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చింతకాని ప్రాథమిక సహకార సంఘం గోదాం, కార్యాలయ అదనపు గదులను ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం రహదారల నిర్మాణం చేపడుతున్నామన్నారు. జగన్నాథపురం గ్రామంలోని కొత్త వెంకటేశ్వరస్వామి దేవాలయం దర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సన్నిధిలో కామేపల్లి మండలం అడవిమద్దులపల్లి గ్రామానికి చెందిన మల్లెబోయిన ఉపేందర్- పద్మ దంపతుల కుమార్తె లాత్వికకు ఉపముఖ్యమంత్రి అన్నప్రసాన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పోట్ల నాగేశ్వరరావు, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, బందెల నాగార్జున, కిలారు మనోహర్‌బాబు, కొండపల్లి శేఖర్‌రెడ్డి, ఇనుకుళ్ల సూరారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.